





# కాంగ్రెస్‌ను నమ్మితే సంక్షేమ పథకాలు బంద్

- ఆ పార్టీ అభ్యర్థికి ఓటడిగే హక్కులేదు
- కారు గుర్తుకు ఓటేసి అభివృద్ధికి సహకరించాలి
- బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ) : పొరపాటున కాంగ్రెస్‌కు నమ్మి ఓటేస్తే సంక్షేమ పథకాలన్నీ బంద్ అవుతాయని, కరెంటు కష్టాలు మళ్లీ మొదటికొచ్చి తెలంగాణ అంధకారం అవుతుందని బీఆర్ఎస్ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం జనగామ పట్టణంలోని 1,13,14,16 వార్డుల్లో స్థానిక కౌన్సిలర్లు మల్లిగారి చంద్రకళ రాజు, పేర్ని స్వరూప ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పల్లా మాట్లాడుతూ 11 పర్యాయాలు అధికారం అప్పగిస్తే స్కీంలు, స్కాంలతో తెలంగాణను దోచుకున్న కాంగ్రెస్‌కు ఓటడిగే హక్కులేదన్నారు. తెలంగాణకు వ్యతిరేకంగా ఉన్న ప్రతిపక్షాలను బొందపెట్టి, ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈసందర్భంగా పలు వార్డుల్లో వివిధ పార్టీల



పల్లా రాజేశ్వర్‌రెడ్డి నుదుట బొట్టు పెడుతున్న మహిళ

నుంచి నాయకులు, యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరగా, పల్లా గులాబీ కండువాలను కప్పి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, తెలంగాణ అభివృద్ధి, సంక్షేమంలో అద్భుతమైన ప్రగతి సాధించిందన్నారు. బీఆర్ఎస్‌ను నమ్మి పార్టీలో చేరిన వారికి అన్నివిధాలా అండగా ఉంటామని, ఏ కష్ట మొచ్చినా కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఆయన స్పష్టం చేశారు. అందరం కలిసికట్టుగా బీఆర్ఎస్ పటిష్టత కోసం పనిచేస్తూ ప్రాంత అభివృద్దే ధ్యేయంగా పనిచేయాలన్నారు..

## ఊసరవెల్లి కొమ్మూరి..

గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి తెలంగాణ రాకముందే మంచి అవకాశాలు ఇచ్చి గౌరవిస్తే ఆ తరువాత ఆయన సొంత లాభం కోసం, వ్యాపారాలను చక్కదిద్దుకునేందుకు చాలా పార్టీలు మారాడని పల్లా విమర్శించారు. కొమ్మూరి మొదట టీఆర్ఎస్, తరువాత వైసీపీ, బీజేపీ, ఇప్పుడు కాంగ్రెస్ ఇలా ఊసరవెల్లిలా పార్టీలు మారుతూనే ఉన్నాడని ఎద్దేవా చేశారు. ఇక కొమ్మూరి నాది లోకల్ కాదంటున్నాడని, ఆయనది చేర్యాల అయితే, నాది తరిగొప్పుల పక్కన ఉన్న సోడషపల్లి జనగామ జిల్లా అన్నారు. ఇద్దరిదీ ఒకే ప్రాంతమైనప్పుడు ఆయన నన్ను స్థానికుడు కాదని ఎలా అంటాడని ప్రశ్నించారు. కొమ్మూరి అభివృద్ధిలో పోటీ పడాలే తప్ప నీతిమాలిన రాజకీయం చేయొద్దని హితవు పలికారు. ఘట్‌కేసర్ వద్ద 300 బెడ్లతో నేను నీలిమ హాస్పిటల్ ఏర్పాటు చేశానని, ఎవరికైనా ఏమైనా కావాలంటే రేషన్‌కార్డు తీసుకెళ్తే అక్కడ ఉచిత సేవలందించే బాధ్యత నాదేనన్నారు. ముఖ్యంగా నేను ఉద్యమ కారుడిన కాదని కొమ్మూరి మాట్లాడడం హాస్యాస్పదమని, రాష్ట్ర సాధన పోరులో భాగంగా జైలుకు వెళ్లిన నాకు జనగామ రవీందర్ రెడ్డి అనే లాయరే బెయిల్ కూడా ఇప్పించాడని గుర్తు చేశారు.

## కాంగ్రెస్ నేతల మాయ మాటలు..

కాంగ్రెస్ మాయ మాటలను నమ్మి మోసపోవద్దు.. మోసపూరిత హామీలతో ఆగం కావొద్దని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు.. ఎన్నికల అనంతరం గృహలక్ష్మి, ఆసరా పింఛన్లు, కమ్యూనిటీ హాళ్లు, రోడ్ల కోసం నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. సీఎం కేసీఆర్ నియోజకవర్గానికి రూ.60 కోట్ల నిధులిస్తే అందులోంచి చేర్యాలకు రూ.10 కోట్లు, జనగామకు రూ. 20 కోట్లు కేటాయించామని, మిగిలినవి గ్రామాల అభివృద్ధికి ఖర్చుచేస్తామని ఆయన చెప్పారు. ఆసరా పింఛన్లతో వృద్ధుల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందని, 18 ఏళ్లు నిండిన వారందరికీ సౌభాగ్య లక్ష్మి కింది రూ. 3000 పింఛన్లు ఇస్తామని, వచ్చే నెల నుంచి రూ.400కే గ్యాస్ బండ వస్తుందన్నారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, కౌన్సిలర్లు పాండు, గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ మహిళా అధ్యక్షురాలు చెంచారపు పల్లవి, నాయకులు బండ యాదగిరి రెడ్డి, బిజ్జాల నవీన్, సోమేశ్వర్, మల్లికాంబ, లాజర్, బక్క లక్ష్మణ్, మాజీద్, ధర్మపురి శ్రీనివాస్ పాల్గొన్నారు.

























